# బ బ్బ బ్బా

శివరాత్రికి రామతీర్థాలు వెళదామని ఉబలాటపడ్డాను. పడ్డట్టే మా వాళ్ళు ఒక రూపాయి ఖర్చుకి యిచ్చేరు. నలుగురిని పోగుచేసుకుని జట్కా కట్టించుకు పోదామనుకున్నాను. కాని రామతీర్థాలకి రావడాన్కి మా వీధిలో మిత్రులు, స్కూల్లో మిత్రులు మా గేంగు గేంగంతా రావడాన్కి సిద్ధమైనారు. అందులో చాలామంది బీదవాళ్ళు జట్కాలూ, గిట్కాలూ ఎక్కడా? నడిచీదాం సరదాగా అన్నారు. పైగా నేను తెచ్చిన రూపాయి పైఖర్చు పెట్టుకుందాం అన్నారు. పెద్దవాళ్ళల్లో అధిక సంఖ్యాకుల నిర్ణయానికి ఒప్పుదల కుదరదుకాని పిల్లల్లో నలుగురాడిన మాట ప్రకారం నడుచుకోక తప్పదు. అందుచేత వాళ్ళందరితోపాటు రాంభజన చేస్తూ తొమ్మిది మైళ్ళూ చక్కగా నడిచీసేను.

ఇదెక్కడ బాగా చిన్నతనంలో ముచ్చట. అప్పటికింకా బట్టిప్పకొని అయ్యా కోనేట్లోపడి ఈత నేర్చుకుంటూ ఉండేవాళ్ళం. నేను చెప్పబోయేది ఆ రోజుల్లో ముచ్చటే.

చిన్నప్పటినుంచీ కనిపెడుతున్నాను. ఊళ్ళోవాళ్ళైతేనేం, స్కూల్లో వాళ్ళైతేనేం నా స్నేహితుల్లో సన్నిహితులంతా బీదవాళ్ళు. ఆ కారణంచేత చిన్నప్పటినుంచీ నాకన్నీ బీద అలవాట్లే. అందుకే ఆవేళ రామతీర్థాలు నడవవలసి వచ్చింది.

ఈ బీద స్నేహితుల మూలాన్న నేనెప్పుడు సినీమాకెళ్ళినా నేల టిక్కట్టు వాళ్ళతోపాటు కొనుక్కునేవాణ్ని. నాలుగోఫారంకి వచ్చేవరకూ లెక్కా పత్రం లేనన్ని సినీమాలు చూసేను. కాని ఎప్పుడూ నేలటిక్కట్టు కొనుక్కునే వెళ్ళేను. ఆ రోజుల్లో నేల రెండణాలు. బెంచీ మూడణాలు. కుర్చీ నాలుగణాలు. ఒక్కనాడు చెప్పుకోడానికైనా కుర్చీకికాదు సరికదా

బెంచీకైనా వెళ్ళి ఎరగను. ఉమ్మల్లో, చుట్టా, బీడీ పీకల్లో, జిమజిమలాడే నేలని న్యూసు పేపర్లు పట్టుకొనిపోయి పరుచుకొని కూర్చునేవాళ్ళం.

నేను నేలకి వెళ్ళేవాణ్ణని మా వాళ్ళకి తెలియదు. తెలిస్తే హర్షిద్దురా? 'వెధవల' సహవాసంచేసి 'వెధవ బుద్ధులకి' అలవాటు పడ్డానని తిడుదురు. కాదామరి ? మా పెద్దలంతా నియ్యోగి ప్రభువులు. మీసాలికి సంపెంగ నూనె రాసుకొనే జాతి.

నేలకెళ్ళడం తప్పుకిందా, తక్కువకిందా నాకా రోజుల్లో ఎన్నడూ తట్టలేదు. సినీమాకి వెళ్ళడమే గొప్ప. నలుగురితో కలిసి వెళ్ళడమే సరదా. కథానాయకుని కత్తిసామూ, గుఱ్ఱపుస్వారీ, ప్రాణాలు ఉగ్గబెట్టుకొని చూడ్డం, కథానాయకి కలవల కోనేట్లో జలకమాడుతూ ఉంటే జాగ్రత్తగా గమనించడం, నలుగురం ఆ మజాలన్నీ కూడబలుక్కోవడం మా అలవాటు. పెద్దలు రిజర్వుడులోకి ఎంత దర్జాగా వెళ్తారో అలాగ నేలకి వెళ్ళేవాళ్ళం. చిన్నపిల్లలకి ఏం కావాలి? సినీమాలో ఆట మధ్యని కేకలెయ్యడం గల్లంతు చెయ్యడం. అది నేలలో కూర్చుంటేనే సుళువుగా సాగుతుంది. ఇప్పుడు నేను సలహా యిస్తాను. పద్దెనిమిదేళ్ళలోపు పిల్లలంతా ఆఖరు తరగతికే వెళ్ళాలి. కుర్చీల్లో మన పక్కని కూర్చొనే పెద్దమనుష్యుల చచ్చు సంభాషణకన్నా నేలని కూర్చొనే మామ్మూలు మనుషుల మాటల్లో నువ్వూ నేనూ నేర్చుకోదగ్గ విజ్ఞానం చాలా ఉంది.

నేనూ నా స్నేహితులూ, నా అలవాట్లూ అలాగుండగా మా యింటికి విశాఖపట్నంనుంచి చుట్టాలు వచ్చారు. వాళ్ళెక్కడ బాబూ? వాళ్ళని చూస్తే నేను హడలెత్తిపోయాను. పాప్లైను షర్టు, బ్లేజర్ కోట్లూ, సిల్కుపంట్లాలూ, బూట్లు వాళ్ళు మామూలుగా ధరించేవాళ్ళు. ఆకుజోళ్ళు తొడిగి ఖద్దరు దుంగిడీ షరాయిలూ, బురఖాల్లాంటి కోరా హొక్కాలూ నేను కట్టేవాణ్ణి. వాళ్ళవేషం ఖరీదైనదే అయినా నేను తేలిగ్గానే ఈసడించేవాణ్ణి. అంత ఖరీదైన బ్లేజరూ ఆ రోజుల్లో ఆరణాల ఖద్దరు చెక్కుకి తీసికట్టు అయింది. విదేశీవస్త్ర దహనకాలం, ఖద్దరు ఎంత గోనెవాటంగా ఉంటే అంత గొప్ప. ఖద్దరు కట్టుకుంటే గౌరవం వచ్చేది. ఖద్దరు కట్టుకొనేవాడు దేశభక్తుడూ, స్వార్థరహితుడు, సత్యవ్రతుడు, త్యాగమూర్తి అనుకొనేవాళ్ళు. ఇప్పుడు మనందరికీ తెలుసు. ఖద్దరు పులులు ధరించే

మేకతోలు కూడా అయిపోయింది. హింసకీ అసత్యానికీ చక్కటి మేలి ముసుగు అయిపోయింది కూడా!

విశాఖపట్నంవాళ్ళు కాఫీ హోటళ్ళలో పూటకి మూడేసి అణాలు మేసేవారు. నేనా రోజుల్లో కాఫీ హోటలు కెళ్ళడమే మహాభాగ్యం. పొద్దున్నే కుండలో చద్దెన్నం తినేవాణ్ని. వాళ్ళు పూర్తిగా కాఫీరాయళ్ళు. నవనాగరికులు. చిటికినవేలు సందులో సిగరెట్లు ఇరికించి దమ్ము ధారాళంగా లాగేవాళ్ళు. నేను సిగరెట్టు పెదిమకి అంటించి ఎరగను.

వాళ్ళు సినిమాకెప్పుడూ వెళ్ళడం కుర్చీకే! దిగువ క్లాసులు వాళ్ళు ఎరగే ఎరగరు. కుర్చీకాదు సరేకదా జన్మానికి బెంచీలోకి వెళ్ళి ఎరగనాయె- వాళ్ళ దర్జా నా గుండెల్లో బ్రహ్మచెవుడు ముల్లులా గుచ్చుకొంది.

విశాఖపట్నం చుట్టాలంతా వెళ్ళిపోయేరు. వాళ్ళెవరో కాదు. మా పెత్తండ్రిగారి కుటుంబమే. మా పెత్తండ్రి భార్యవంక చుట్టాలు కొందరు. మా పెత్తండ్రిగారి పెద్దబ్బాయి మాత్రం, నెలవలన్నాళ్ళూ మా ఊళ్ళో మాతో ఉండిపోయేడు. రోజూ నా గేంగు స్నేహితులందర్నీ పోగుచేసి అన్నయ్యతో కలిసి నల్లచెరువుకి పోయి బిళ్ళాకర్రా ఆడుకొనేవాళ్ళం. శ్మశానంలో గెంతులేసేవాళ్ళం. మెట్టలెక్కేవాళ్ళం.

సినిమా కెళదామని అన్నయ్య ఇంట్లో రోజూ గొడవ పెట్టేవాడు. మా నాన్న వెళ్ళడానికి వీల్లేదని గట్టిగా చెప్పేడు. ప్రతి వెధవ ఫిల్ముకీ వెళ్ళి డబ్బు తగలెయ్యటం మంచిదికాదని మా అన్నయ్యకి మా నాన్న చాలా నచ్చచెప్పేడు. విశాఖపట్నం వాళ్ళు వచ్చిన ప్రతి ఫిల్ముకీ వెళతారట. ఊళ్ళో కొచ్చిన ప్రతి ఫిల్మూ చూసి తీరాలని వాళ్ళ సిద్ధాంతం. గోడలమీద పోష్టర్లుచూసి చూడడంతో అన్నయ్య గోల మళ్ళా ప్రారంభించేడు. ఆ ఫిల్ములాంటి ఫిల్ము వెనక తీయలేదని, ముందు తీయలేరని బారెడేసి కాయితాలు ఊరంతా పంచిపెట్టేరు. ఊరు గోడలన్నీ పన్నెండేసి అడుగుల రంగు రంగుల పోష్టర్లతో నిండిపోయాయి. వొంటెద్దు బళ్ళ గూళ్ళమీద పల్లెటూళ్ళ నుంచి వచ్చే రెండెడ్ల బళ్ళ గూళ్ళమీదా ఆ ఫిల్ము పోష్టర్లే. ఆ ఫిల్ముకి వెళ్ళకపోతే ఎందుకొచ్చిన జన్మ అంటాడు అన్నయ్య. ఎడ్వర్టైజుమెంటుకి మోసపోయి అన్నాడో, తెలిసే అన్నాడో ఫిల్ము

మంచిదే వెఘదురుగాని లెండి అని మానాన్న భరవసా యిచ్చేడు. ఫలానా రోజుని వెళ్ళండని కూడా చెప్పేడు.

మేము సినిమాకి వెళ్తున్నామన్న సంగతి ఊరూవాడా ఎగరగొట్టే సేము. మా గేంగు వాళ్ళందరికీ టిక్కట్లు నేనే కొని తీసుకెళదామని కూడా నిశ్చయించుకున్నాను.

మా గేంగు విషయం చెప్పాలి. మొదట్లో మా గేంగు చాల పెద్దది. అల్లరికి, రౌడీతనానికి ఊళ్ళో ఉన్న అన్ని పేటలకీ పేరుమోసింది. మా గేంగు పేరు చెపితే ప్రతి స్టూడెంటుకీ హడలే. అంతా ఒక్క మాట మీద నిలబడే వాళ్ళం. గ్రిగ్గు టోర్నమెంట్లు వచ్చేయి. దెబ్బలాటలు ప్రారంభమైనాయి. నువ్వెంతంటే నువ్వెంతంటూ పోటీలు బయల్దేరాయి. 'స్పోర్ట్సు' సౌభ్రాతృత్వాన్ని, ఐకమత్యాన్ని - ద్వేషరాహిత్యాన్ని అభి వృద్ధి పరుస్తాయని మా మేష్టర్లు చెప్పగా, కాంపోజిషన్లు రాసేము. అవి సర్వత్రా నిజమేమోకాని మాగేంగు విషయంలో మాత్రం తల్లక్రిందులైంది. ఎదుట పార్టీ వాళ్ళని చూస్తే పంతం, ఉడుకుబోతుతనం, మత్సరం, కోపం, మాలో మహా వృక్షాల్లా పెరిగిపోయాయి. మా తగవులు ఎన్నిసార్లో తన్ను కోడందాకా వచ్చాయి. మాగేంగు రెండుపార్టీలై పోయింది. టోర్న మెంట్లు నుంచి వెనకటి మిత్రులు శత్రువులై పోయేరు. మొదటి ఉధృతం తగ్గినా మాపోటీ, పంతగొట్టుతనం మమ్మల్ని విద్యార్థిదశ వదలిపెట్టేదాకా వదలలేదు. అంచేత మాగేంగు సినీమాకి వెళ్తున్నామనగానే మా ఎదటిపార్టీ కూడా బయల్దేరింది.

మాగేంగు కావేళ నేనే నాయకుణ్ణి. నాకు గర్వంతో బుజాలుపొంగి పోయేయి. సైన్యాన్ని ముందుకి నడిపే నెపోలియన్నై పోయేను. నా పక్కని మా విశాఖపట్నం అన్నయ్య పొడుం రంగుబ్లేజరు కోటు తొడు క్కొని నడుస్తున్నాడు. వెనక నలుగురు మిత్రులూ ఉన్నారు. విదేశీ బట్ట లంటే కిట్టకపోయినా బ్లేజర్ కోటు అన్నయ్య పక్కనడుస్తూ ఉండగా నడిబజారులోంచి ఎదట పార్టీవాళ్ళు చూస్తూ ఉండగా వెళ్ళడం నాకు బుజాలు పొంగిపోయేయి.

మా ఎదట పార్టీకావేళ లీడరు మృత్యుంజయరావు. వాడు రిటైర్డు రైల్వే ఉద్యోగి కొడుకు. చిత్తుగా ఉన్నవాడు. ఉన్నవాడైనా నాలాగే వాడికి

అన్నీ బీద అలవాట్లే. మాతోపాటు సినీమాకి నేలకే వచ్చేవాడు. అమాంతంగా ఆరుగుర్ని వెంటబెట్టుకుని ఆ వేళ వచ్చేడు. మమ్మల్ని చూచి వాడు 'బొంబాయి బావురుపిల్లి' అని గట్టిగా అరిచేడు. వాళ్ళ జట్టులో ఒకడు 'మ్యావ్' అన్నాడు. అదంతా మా మీద సవాలే.

వాళ్ళకి గట్టిగా ఆవేళ కాజాయివ్వాలనుకున్నాను. పూర్తిగా సిగ్గొచ్చేటట్టు, చిన్నబోయేటట్టు చెయ్యాలనుకున్నాను. నా పర్సు ఆవేళ చాలా బరువుగా వున్నది. నా అన్ననీ నన్నూ చూసి వాళ్ళు ఉడుక్కునేటట్టు చెయ్యాలనుకున్నాను.

సినీమా పెండాలు చేరుకున్నాము. అనవసరమైనా కిళ్ళీ దుకాణాని కెళ్ళేము. అందరికీ సోడాలు ఆర్డరు చేసేను. గేసు లేకపోయినా కొట్టువాడు గంటన్నర కీచులు పెట్టిస్తూ బుడ్లు కొట్టేడు. మా వాళ్లంతా సోడాబుడ్లు తాగుతూవుంటే పొంగిపోయేను. నాకా రోజుల్లో సోడాబుడ్డిని పట్టుకుని తాగడం గొప్పగా ఉండేది. ఈనాటి మన మిత్రులు బాదంబీర్ కాగితపు గొట్టాంతో పీలుస్తూ ఎంత మురుస్తారో నేనా రోజుల్లో కాణీ సోడాబుడ్డికి అంత మురిసేవాణ్ణి.

మృత్యుంజయరావు తనగేంగునీ కొట్టుదగ్గిరికి లాక్కొచ్చాడు. "ఏంవోయి, ఏడు లైమ్ జ్యూస్ లియ్యి" అని మహా గోరోజనంగా ఆర్డరిచ్చేడు. కొట్టువాడు కొట్టడం ప్రారంభించేడు. కొందరు లైమ్‌జ్యూస్ లొద్దని ఆరెంజిలూ, జింజిర్లూ మార్చేసేరు. బురుగులు లేస్తూ పచ్చగా, ఎర్రగా పొంగుతున్నాయి కలర్లు. నాకు మొట్టికాయ పెట్టినట్టయింది. వాళ్లు మహాగోరోజనంగా తాగి తేన్పులు మొదలెట్టేరు. పెద్ద పెద్ద దొంగ తేన్పులు. నన్నూ నా సోడాకాయల్ని వెక్కిరిస్తున్న దొంగతేన్పులు. మృత్యుంజయరావు మండమీద నోరుపెట్టి 'బబ్బ బ్బా బ్బా' కొట్టేడు. వాడంత చక్కగా మా గేంగులో ఎవ్వడూ మండమీద నోరుపెట్టి "బబ్బ బ్బా" కొట్టలేరు. మమ్మల్ని ఎగతాళిచేస్తూ వాడుకొట్టిన బబ్బ బ్బాకి నా వొళ్ళు గంగవెర్రులెత్తింది. పక్కని గౌరవనీయుడైన బ్లేజరుకోటు అన్నయ్య ఉండబట్టికాని లేకపోతే శిఖపట్ల గోత్రానికి దిగిపోవలసిన పరిస్థితే అది. సరే వీళ్ళ రోగం సినిమాలో అణుస్తానుకదా అని సముదాయించుకున్నాను.

డైనమో టప్‌టప్ అంటూ పనిచెయ్యడం మొదలెట్టింది. తెలుగు పట్టణాలు ఆ రోజుల్లో విద్యుచ్ఛక్తికి నోచుకోలేదు. పెండాలుచుట్టూ లైట్లు వెలిగేయి. పెండాలుమీద రంగురంగుల బల్బుల తోరణం ఆకాశంలోకి వెలిగింది. బేండుమేళం ఉత్సాహపూరితంగా వాయించబడ్డాది. జనం విరగ బడి వచ్చేరు. ఆవేళ సినిమా బొంబాయి బావురుపిల్లి. ఆ ఫిల్ము ఎప్పుడు వస్తుందని నెలల తరబడి ఊరు ఊరంతా కాచుకుని కూచుంది.

టిక్కెట్టుకోసం తోపులాట యుద్ధం ప్రారంభమైంది. నేనే జనాన్ని తోసుకుంటూవెళ్ళి టిక్కట్లు కొన్నాను. ఆ తోపులాటలోకి వెళ్ళి టిక్కట్లు అంతా తేలేరు. రద్దీ రోజున కిందతరగతి టిక్కట్లు కొనితెచ్చినవాడు చిన్న హీరో అవుతాడు. అంతా అభినందిస్తారు. మా గేంగుకి ఆ సాయంకాలం నేనే హీరోని.

ఆవేళ నేను బెంచీ టిక్కట్లు కొన్నాను. ఆరుగురికీ ఆరుమూళ్లు పద్దెనిమిదణాలు. రూపాయిబేడ పెట్టి బెంచీ టిక్కట్లు కొన్నాను. నా జన్మకి బెంచీ టిక్కెట్టు కొనివెళ్ళడం అదే మొదటిసారి. వాస్తవంగా కుర్చీకి కొన వలసింది. మా విశాఖపట్నం అన్నయ్యా వాళ్లూ కుర్చీలకే కదూ వెళ తారూ? వాడితో మా గొప్ప నిలబెట్టుకోవడానికి, కుర్చీలు కొండానికే తయారుపడ్డాను. మా అన్నయ్యే యింతమందికి కుర్చీలు కొంటే డబ్బు దండుగ ఒద్దనేశాడు. ఆవేళ మా ఇంటి స్టాటస్ సంగతి నాకు బాగా తెలి సింది. నేలకెళ్ళడం పరువుతక్కువపనే. బీదస్నేహితులతో పొత్తుగా తిర గడం కూడా తప్పేమో అన్నభావం కలిగింది. అదృష్టవశాత్తు ఆ భావం ఆ క్షణం మాత్రమే ఉంది. ఇప్పటికీ నాకు సన్నిహితులైన మిత్రుల్లో అధిక సంఖ్యాకులు బీదవాళ్ళే. వాళ్ళే నా గౌరవానికి పాత్రులు. ధనిక వర్గంలో సన్నిహితులు ఎక్కడోకాని లభ్యం కారు.

బెంచీక్లాసులోకి నలుగురినీ వెంటబెట్టుకుని జమీందారులాగ ప్రవే శించేను. బెంచీలు ఈనాడే బాగులేవు. ఆ నాడు నాల్గు కొయ్యలకి చెయ్యి వెడల్పు చెక్కలు దిగ్గొడితే బెంచీలు అయిపోయేవి. వాటిమీదెక్కి కోతుల్లా కూర్చున్నాం. సర్కస్ గేలరీలు బాగా అలవాటేకదూ.

నిలబడి నేనంతా వెతికేను. మా ఎదుటి పార్టీవాళ్ళు నేలకొస్తారు.

బెంచీల్లో మమ్మల్ని చూచి చిత్తయిపోతారు. మా అన్నయ్య పడనిచ్చాడు కాదు కాని కుర్చీలకెళితే మరీ భేషుగ్గా వుండేది.

వాళ్ళెవరూ కనబడలేదు. వాళ్లు మా కాళ్ల దగ్గిర నేలని కూర్చుని మమ్మల్నిచూచి ఉడుక్కుని చస్తారని సంబరపడితే వాళ్లసలు సినిమాకే రాలేదు కాబోలు. నేల కిటకిటా నిండిపోయిందికాని వాళ్లు రాలేదు. వాళ్ళు రాకపోతే మేము బెంచీల్లో కూర్చోడం చూడకపోతే నా సంతోషం నీళ్లు పోసిన నిప్పు అయిపోతుంది.

పెండాలెగిరిపోతూ "బబ్బబ్బా" వినపడ్డాది. తుళ్లిపడి వెనక్కి చూసేను. మృత్యుంజయరావు నన్ను చూస్తూ మండమీద నోరుపెట్టి మళ్లా బబ్బబ్బా కొట్టేడు. వాళ్లేడుగురూ మొదటివరస కుర్చీలలో వరసగా కూర్చున్నారు. ఏడుగురూ కిళ్ళీలు బిగించి సిగరెట్లు వెలిగించేరు. నా వెన్ను విరిగిపోయినట్లయింది. వెన్నెముకలోంచి మండ్రకప్ప పాకినట్లయింది. నన్నుచూచి వాళ్లంతా చప్పట్లు కొట్టేరు. హాలంతా పడపడా చప్పట్లు కొట్టేరు. ఎవడో పెద్ద ఈలవేశాడు. హాలంతా నన్ను లేవిడి అంటున్నట్లు ఈలలతో, చప్పట్లతో, గావుకేకలతో, బబ్బాబబ్బాలతో నిండిపోయింది. "క్రీఁ" అంటూ బెల్లు వాగేదాకా హాలు గల్లంతులతో నిండిపోయింది.

సినీమా ప్రారంభమయింది. నేలలో తెరదగ్గిరగా కూర్చుంటే తాటిచెట్టంత కనబడే కథానాయకి సన్నంగా, సలాకులాగా మనిషంతే కనబడ్డాది. మా బృందంలో ఒకడు, "ఇంత చిన్న బొమ్మలు కనబడుతున్నాయేవిటి?" అన్నాడు. ఎప్పుడయినా బెంచీమొహం ఎరిగితేనా? మా అన్నయ్య నన్ను గోకి, "ఎవడీ బెంటు? వీణ్ణి నేలకు తోసీలేకపోయావూ? కంపు వెధవ!" అన్నాడు. మా అన్నయ్యకి నేనో బెంటునని తెలీదు. వాడి కంటికి బెంటుగా కనపడ్డ మిత్రుడు యిప్పుడు పి. హెచ్. డి. పూనాలో ఉన్నాడు. మా అన్నే స్కూలుఫైనల్ తగలేసి క్లబ్బు మెంబరై పొరాంబోకుల్లో కలిసిపోయేడు.

మా ఎదటి పార్టీ వాళ్లు ఆ మర్నాటినుంచీ నాకు 'బెంచీ' అని పేరుపెట్టి ఉడికించేవాళ్లు. వాళ్లుడికించినట్టే నేను ఉడుక్కునేవాణ్ణి ఉడుక్కోకూడదనుకుంటూ ఉడుక్కునేవాణ్ణి. వాళ్ళని కత్తిపీట పట్టుకుని మా అవ్వ దూట తరిగినట్టు తరిగేద్దామని ఉండేది.

మృత్యుంజయరావు తినిపించిన కురిడీ నన్ను మూడు సంవత్సరాలు పీడించుకుతింది. నాకా సంగతి జ్ఞాపకానికొస్తే చాలు ఆ రోజున పడ్డ బాధంతా మళ్ళా వచ్చిపడేది. వొళ్లు మండిపోయేది. ముక్కుపుటా లెగిరిపోయేవి. ముచ్చెమటలు పోసేవి. చేతకానితనంతో ఒళ్లు కంపించేది. ఎవడైనా బబ్బబ్బా కొడితేచాలు తుళ్లిపడి చూసేవాణ్ణి. నాడు పడ్డ బాధంతా మళ్లా పడేవాణ్ణి.

అప్పటి వాళ్లందరమూ పెద్దవాళ్లమయాము. ఇప్పుడు కనపడితే కుశల ప్రశ్నలు వేసుకుంటాము. ఆ చిన్ననాటి వైరాలు జ్ఞాపకం వస్తే జాయంటుగా నవ్వుకొంటాము. ఈనాటికీ ఎవడేనా బబ్బబ్బా కొడితే ఆనాటి కథ జ్ఞాపకం వస్తుంది. ఆనాటి "నన్ను" చూసి ఈనాటి "నేను" నవ్వుకుంటాను.